క్లుప్తంగా

వీఆర్వో కుటుంబానికి ఆర్థిక సాయం

కాజులూరు: అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కోలంక వీఆర్వో సాదు పుల్లయ్య కుటుంబానికి మండల రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఆర్థిక సహకారం అందజేశారు. వీఆర్వో సాదు పుల్లయ్యకు ఇటీవల కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో బ్రెయిన్ ఆపరేషన్ జరిగింది. మండల తహసీల్దార్ బి.సాయి సత్యనారాయణ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది స్వచ్ఛందంగా రూ.25 వేలు సమకూర్చి ఆదివారం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి వెళ్లి పుల్లయ్య భార్య లక్ష్మికి అందజేశారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ముందంజ


ఎస్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ సత్యనారాయణ

కాజులూరు: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఎస్టీయూ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షుడు పి.సత్యనారాయణ అన్నారు. ఆదివారం సంఘ సభ్యులు ఎంపీపీ మాత భారతి, జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకటసుబ్బారావు, ఎంపీడీఓ సీహెచ్ ఇందిరాదేవి, మండల విద్యాశాఖాధికారి కేవీవీ సత్యనారాయణలను కలుసుకుని వారితో ఎస్టీయూ 2023 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శులు మోర్త శ్రీనివాస్, ఎస్.సత్యనారాయణ, పి.రామకృష్ణ, మండల కార్యదర్శి కొండమూరి వెంకట్, కె.కృష్ణ పాల్గొన్నారు.

పింఛన్.. నూతనానందం..

- ఈ నెల నుంచి రూ.2,750కు పింఛన్ పెంపు
- సంతోషం వెలిబుచ్చుతున్న లబ్ధిదారులు

మండపేట: నూతన సంవత్సరం తొలిరోజునే పింఛన్ దారుల మోములు మెరిశాయి. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటివరకూ ప్రతి నెలా రూ.2,500 అందిస్తున్న పింఛన్‌ను ఈ నెల నుంచి రూ.2,750కు పెంచడంతో లబ్ధిదారుల్లో ఆనందం వెల్లివిరిసింది. ఎప్పట్లాగే 1వ తేదీ ఉదయం నుంచే వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్ పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్త ఏడాదిలో కొత్త కానుక ఇచ్చారంటూ ముఖ్యమంత్రి జగన్‌కు లబ్ధిదారులంతా కృతజ్ఞతలు తెలియజేయడం కనిపించింది. మండపేటలో ప్రస్తుత నెల నుంచి పెరిగిన పింఛన్ సాయాన్ని లబ్ధిదారులకు ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు పంపిణీ చేశారు. మండపేట 1వ వార్డులో మున్సిపల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, కౌన్సిలర్ మారిశెట్టి సత్యనారాయణ, పార్టీ నేత పేపర్తి సత్యనారాయణ లబ్ధిదారులకు అందజేశారు.

రాయవరం: కొత్త సంవత్సరంలో పెన్షన్‌దారులకు కొత్త కానుకను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పింఛన్ రూపంలో అందజేశారు. వైఎస్సార్ పింఛన్ కానుకను ఆదివారం రూ.2,750 వంతున అందజేశారు. వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు ఉదయం 6 గంటల నుంచే ఇంటింటికీ వెళ్లి పింఛన్లను అందజేశారు. రాయవరం మండలంలో 10,028 మందికి గాను రూ. 2,71,36,000 పంపిణీ చేయాల్సి ఉండగా, ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు 6,870 మందికి రూ.1,85,46,750లు పంపిణీ చేశారు. మండలంలో 69 శాతం పెన్షన్లు పంపిణీ కాగా, మిగిలిన వారికి సోమ, మంగళవారాల్లో పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో డి.శ్రీనివాస్ తెలిపారు. రాయవరం మండలం నదురుబాదలో పింఛన్లను పెంచినందుకు కృతజ్ఞతగా పార్టీ ప్రచార కమిటీ జిల్లా కన్వీనర్ సిరిపురపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

కపిలేశ్వరపురం: నూతన సంవత్సరం తొలి రోజు తెల్లవారుజామునే వలంటీర్లు అవ్వతాతలకు రూ.2,750 చొప్పున పింఛన్ మొత్తాన్ని చేతికందించారు. పెరిగిన పింఛను మొత్తంతో పేదలు అమితానందాన్ని పొందారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన నాటి నుంచి ఏ ఒక్క నెలా పింఛను డబ్బుల పంపిణీ ఆగలేదు. మండలంలోని 19 గ్రామాల్లో 344 మందికి నూతన సంవత్సరం వేళ కొత్త పింఛన్లు మంజూరయ్యాయి. వారితో కలిపి 10,089 మందికి పింఛన్ పంచేందుకు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సన్నద్ధమయ్యారు. తొలిరోజైన ఆదివారం 89 శాతం పింఛన్లను పంపిణీ చేశారు.


నదురుబాదలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న శ్రీనివాసరావు


పసలపూడిలో వృద్ధురాలు కృష్ణవేణికి పింఛన్ అందజేస్తున్న వలంటీరు సత్యవేణి


పడమర ఖండ్రికలో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్, సర్పంచ్


మండపేటలో లబ్ధిదారుకు పింఛన్ సాయం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

నేడు ముక్కోటి వైకుంఠ ఏకాదశి

పీఠంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు

రాయవరం: ముక్కోటి వైకుంఠ ఏకాదశి రోజున ఉత్తర ద్వార దర్శనం సర్వపాప హరణం అనేది భక్తుల నమ్మకం. శ్రీమహావిష్ణువును సప్త లోకాలకు అధిష్ఠాన దైవంగా భావిస్తారు. సోమవారం జరిగే ముక్కోటి వైకుంఠ ఏకాదశికి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. ముఖ్యంగా వెదురుపాక విజయదుర్గా పీఠంలో ముక్కోటి వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని టీటీడీ దేవస్థానం అందజేసిన శ్రీదేవి, భూదేవి సమేత విజయవెంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించనున్నారు. పీఠంలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేసినట్లు పీఠం పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్(బాబి) తెలిపారు. సోమేశ్వరంలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరాలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఏకాదశి వ్రతం నిర్వహిస్తున్నారు.


వెదురుపాక విజయదుర్గా పీఠంలో ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

సోమేశ్వరాలయంలో..

సోమేశ్వరం బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరాలయంలో ఏటా స్థానిక భూమంచిరెడ్డి యూత్ ఆధ్వర్యంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ తెలిపింది.

సందడిగా.. నూతన సంవత్సర వేడుకలు

- ఊరూరా న్యూ ఇయర్ జోష్
- కిటకిటలాడిన నేతల నివాసాలు


జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ పద్మ దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగులు


రామచంద్రపురం ఎంపీపీ అంబటి భవానికి శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజాప్రతినిధులు


మండపేటలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు


రాయవరం ఎంపీపీ వెంకటరమణకు శుభాకాంక్షలు చెబుతున్న వైఎస్సార్ సీపీ నేతలు


కపిలేశ్వరపురం ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణికి శుభాకాంక్షలు చెబుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

మండపేట: నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. ప్రజలందరూ 2022కు వీడ్కోలు చెబుతూ 2023 సంవత్సరాన్ని ఘనంగా స్వాగతించారు. కుర్రకారు పార్టీలతో హోరెత్తిస్తే, చిన్నారులు గ్రీటింగ్ కార్డులతో హల్‌చల్ చేశారు. కార్యకర్తలు, అభిమానుల తాకిడితో నేతలు, ప్రముఖుల నివాసాలు కిటకిటలాడాయి. ఒకరికొకరు పూలబొకేలు, గ్రీటింగ్‌కార్డులు, స్వీట్లు ఇచ్చుకుంటూ నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ మహిళలు ఇంటి వాకిళ్లను రంగ వల్లులతో తీర్చిదిద్దారు. ఆదివారం మండపేటలోని రథంగుడి, వేంకటేశ్వర స్వామి వారి ఆలయం, అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. నూతన సంవత్సరంలో ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార, పౌరసంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆకాంక్షించారు.

తోటకు శుభాకాంక్షల వెల్లువ

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు స్థానిక సూర్య ఫంక్షన్‌హాలులో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్సీ తోటకు శుభాకాంక్షలు తెలిపేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ఫంక్షన్ హాలు కిక్కిరిసిపోయింది. అందరి సమక్షంలో తోట కేక్ కట్‌చేసి వేడుకలు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ దూలం పద్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బిక్కిన కృష్ణార్జునచౌదరి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నేతలు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, కర్రి పాపారాయుడు, రెడ్డి రాజుబాబు, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని నివాసాలు, కార్యాలయాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

కాజులూరు: గొల్లపాలెం అలయన్స్ క్లబ్ సభ్యులు కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించగా పలువురు స్థానిక యువకులు కాజులూరు జంక్షన్‌లో భారీ ఎత్తున బాణాసంచా కాల్చారు. మండలానికి చెందిన పంచాయతీ కార్యదర్శులు ఎంపీపీ మాత భారతి మురళి, ఎంపీడీఓ ఇందిరాదేవిలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ పుష్పగుచ్ఛం అందజేశారు.

రాయవరం: నూతన సంవత్సరం సందర్భంగా ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల నేతలు ఎంపీపీ నౌడు వెంకటరమణ, పసలపూడిలో జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారువెంకటరెడ్డిల ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సర వేడుకల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా రాయవరం ఎస్‌ఐ పీవీవీఎస్ఎన్ సురేష్ ఆధ్వర్యంలో సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. పసలపూడిలోని ఏసు కరుణాలయం బాప్టిస్ట్ చర్చిలో పాస్టర్ పి.భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మాజీ జెడ్పీటీసీ కర్రి వెంకటరెడ్డి(కృష్ణ), పారిశ్రామికవేత్త చైతన్య రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: నూతన సంవత్సర దినోత్సవం సందర్భంగా అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తమతమ ఆత్మీయులకు శుభాకాంక్షలు చెబుతూ సందడి చేశారు. మండపేటలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, వెంకటాయపాలెంలో ఆయన తనయుడు పృథ్వీరాజ్‌కు శుభాకాంక్షలు చెప్పేందుకు ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు తరలివెళ్ళారు. మండలంలోని ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ చుండ్రు చిట్టిబాబుల నివాసాలు సందర్శకులతో నిండిపోయాయి.

కె.గంగవరం: నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ శనివారం అర్ధరాత్రి నుంచి యువత బైక్‌లపై హల్‌చల్ చేశారు. కె.గంగవరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ పంపన నాగమణికి పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు, పూలదండలతో శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది నూతన సంవత్సర వేడుకల్ని ఘనంగా నిర్వహించారు.

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం పట్టణంలోని తన నివాసం వద్ద రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. పార్టీ నేతలు, జిల్లా అధికారులు మంత్రి వేణును కలసి పుష్ప గుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అంబటి భవానిని ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. ద్రాక్షారామలో జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, వైఎస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, అన్నాయిపేటలో వైఎస్ ఎంపీపీ శాకా చంద్రశేఖర సూర్యప్రకాష్‌లకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. వెలంపాలెంలో రాష్ట్ర ఎడ్యుకేషన్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, గ్రామ సర్పంచ్ టేకుమూడి సుజాత, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణలకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.


కె.గంగవరం ఎంపీడీఓ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ నాగమణి తదితరులు


పసలపూడి చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న కృష్ణ, చైతన్య రాజబాబు

వైభవంగా షిరిడీ సాయి మహాస్థూపం ఆవిష్కరణ

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాద షిరిడీ సాయిబాబా ఆలయం వద్ద నూతనంగా నిర్మించిన 130 అడుగుల షిరిడీ సాయి మహాస్థూపం ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం వైభవంగా నిర్వహించారు. షిరిడీ సాయి సేవాశ్రమం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముందుగా తెల్లవారుజామున సేవాశ్రమ వ్యవస్థాపకుడు అమ్ముల సాంబశివరావు గురూజీ సత్సంగ ప్రసంగం, బాబాకి హారతులు, సుప్రభాత సేవ, అభిషేకాలు నిర్వహించారు. వేలాది మందితో సామూహిక సాయి సత్యవ్రతాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన చేశారు. బాబాకి పూలతో చేసిన ప్రత్యేక అలంకరణ విశేషంగా ఆకట్టుకుంది.

భీమేశ్వరాలయంలో మంత్రి వేణు ప్రత్యేక పూజలు

రామచంద్రపురం రూరల్: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ పీటీవీవీ సత్యనారాయణ(తారకేశ్వర రావు) ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం భీమేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు, మాణిక్యాంబ అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించుకున్నారు. అనంతరం నంది మండపంలో వేద పండితుల వేదాశీర్వచనం అందుకున్నారు. షిరిడీ సాయి మహాస్థూపం సందర్శించిన మంత్రి వేణు మండలంలోని హసన్‌బాదలో 130 అడుగుల షిరిడీ సాయి మహాస్థూపాన్ని మంత్రి వేణు సందర్శించారు. సాయిసేవకులు మంత్రి వేణుకు బాబా జ్ఞాపికను అందజేశారు.


భీమేశ్వరాలయంలో వేద పండితుల వేదాశీర్వచనం అందుకుంటున్న మంత్రి వేణు